సాక్షి
కుమురం భీం

బుధవారం ♦ 28 ♦ ఫిబ్రవరి ♦ 2024



భళా.. బాలశాస్త్రవేత్తలు!
పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు టెక్నాలజీపై పట్టు సాధిస్తున్నారు. వినూత్నంగా ఆలోచించి అద్భుత ఆవిష్కరణలు రూపొందిస్తున్నారు. 8లో▸



సమస్యల్లో 'కొత్తగూడ'!
గిరిజన గూడెం కొత్తగూడ సమస్యలతో సతమతమవుతోంది. ఏళ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాలు లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.4 /23.1

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా జిల్లాలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 64 పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో తుకారాం మంగళవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారం, మార్గదర్శకాల కోసం జిల్లా వెబ్‌సైట్ https://asifabad.telangana.gov.in ను సందర్శించాలని సూచించారు. దరఖాస్తు పూర్తి చేసి, ధ్రువపత్రాల జిరాక్స్‌లతో స్వయంగా లేదా పోస్టు ద్వారా మార్చి 11లోగా కలెక్టరేట్‌లోని వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో సైన్స్ ప్రదర్శనలు తప్పనిసరి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తప్పనిసరిగా సైన్స్ ప్రదర్శనలు నిర్వహించాలని జిల్లా సైన్స్ అధికారి మధుకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ పాఠశాలలో ల్యాబ్ మెటీరియల్ ప్రదర్శనతోపాటు సర్ సీవీ రామన్ ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించాలని సూచించారు.

కొనసాగుతున్న 'విజిలెన్స్' సోదాలు



సోదాలు నిర్వహిస్తున్న అధికారులు

దహెగాం(సిర్పూర్): జిల్లాలోని రైస్ మిల్లులో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. మంగళవారం దహెగాంలోని శ్రీవాసవి మోడరన్ రైస్ మిల్లును తనిఖీ చేశారు. వానాకాలం, యాసంగికి సంబంధించి ధాన్యం బస్తాలు నివేదికల ప్రకారం 26,850 బస్తాలు ఉండాల్సి ఉండగా.. రైస్‌మిల్లులో బస్తాలు సక్రమంగానే ఉన్నాయని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ దినేష్ చంద్ర తెలిపారు. తనిఖీల సమయంలో లారీలో తెచ్చిన బియ్యాన్ని పరిశీలించారు. సీఎంఆర్ బియ్యంలో అవకతవకలు సరి చేయడానికి బియ్యం తీసుకువచ్చారా.? అనే కోణంలో విచారణ చేపట్టాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు అనిల్‌కుమార్, ప్రశాంత్‌రావు, డీటీ శ్యాంలాల్, శ్రీనివాస్ ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

కౌటాల(సిర్పూర్): అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. కౌటాల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు బాధితుల ఫిర్యాదులపై వేగంగా స్పందించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులు, రిసెప్షన్, లాకప్, మెస్ బ్యారక్‌ను పరిశీలించారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్సై మధుకర్, సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి



మాట్లాడుతున్న భాస్కర్

వాంకిడి(ఆసిఫాబాద్): జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి చేయాలని జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం, సఖి కేంద్రం ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కీలకంగా ఉండే అంగన్‌వాడీ సిబ్బంది బాల్య వివాహాలను అరికట్టడంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆడపిల్లలు వివక్షకు గురికాకుండా చూడాలన్నారు. గర్భవిచ్ఛిత్తిని అరికట్టడంతోపాటు పౌష్టికాహారం అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మహిళా సాధికారత కేంద్రం, సఖి కేంద్రం సభ్యులు వివిధ సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో రెబ్కా, డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ రాణి, ఆర్థిక నిపుణులు సాగర్, సఖి సీఏ మమత, కేస్ వర్కర్ శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ఘంటికలు!



అంతంత మాత్రంగానే ప్రవహిస్తున్న గంగాపూర్ వాగు

- రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలాలు
- బెజ్జూర్‌లో ప్రమాదకరంగా 2.03 మీటర్లు కిందికి..
- క్రమంగా ఎండిపోతున్న వాగులు, చెరువులు
- వేసవి ప్రారంభంలోనే ఇబ్బందులు

జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి (మీటర్లలో)

మండలం	డిసెంబర్	జనవరి	వ్యత్యాసం
ఆసిఫాబాద్	10.19	10.78	–0.59
బెజ్జూర్	3.72	5.75	–2.03
దహెగాం	14.57	14.72	–0.15
జైనూర్	4.65	5.10	–0.45
సిర్పూర్(యూ)	3.28	3.57	–0.29
కాగజ్‌నగర్	8.00	8.89	–0.89
కెరమెరి	8.56	8.76	–0.20
కౌటాల	3.58	4.23	–0.65
లింగాపూర్	1.10	1.20	–0.10
చింతలమానెపల్లి	3.12	3.89	–0.77
పెంచికల్‌పేట్	14.07	14.68	–0.61
రెబ్బెన	5.97	7.37	–1.40
సిర్పూర్(టి)	3.38	4.26	–0.88
తిర్యాణి	6.77	6.83	–0.06
వాంకిడి	6.50	6.87	–0.37

2023 జనవరి, 2024 జనవరిలో భూగర్భ జలాలు(మీటర్లలో)

మండలం	2023 జనవరి	2024 జనవరి
ఆసిఫాబాద్	9.66	10.78
బెజ్జూర్	4.07	5.75
దహెగాం	10.76	14.72
జైనూర్	4.52	5.10
సిర్పూర్(యూ)	3.56	3.57
కాగజ్‌నగర్	7.76	8.89
కెరమెరి	9.40	8.76
కౌటాల	3.88	4.26
లింగాపూర్	1.17	1.20
చింతలమానెపల్లి	2.82	3.89
పెంచికల్‌పేట్	14.17	14.68
రెబ్బెన	6.27	7.37
సిర్పూర్(టి)	3.18	4.26
తిర్యాణి	7.58	6.83
వాంకిడి	6.57	6.87

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో రోజురోజుకూ భూగర్భ జలాలు కిందకి పడిపోతూ ఆందోళన కలిగిస్తున్నాయి. వేసవి ప్రారంభంలోనే భూమిలో నీటి వనరులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. మండుటెండల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ముందస్తుగానే ముఖం చాటేయటంతో ఆ ప్రభావం భూగర్భ జలాలపై పడింది. రానున్న రోజుల్లో ఏజెన్సీ ప్రాంతాలతో పాటు మైదాన ప్రాంతాల్లోనూ నీటిఎద్దడి పరిస్థితులు తప్పేలా లేవు. గడిచిన నాలుగు నెలలుగా వర్షాలు లేకపోవడంతో వాగులు, వంకలు వేసవికి ముందే వట్టిపోతున్నాయి. ఏడాది పొడవునా జల ప్రవాహంతో కళకళలాడే వాగులు, చెరువులు, కుంటలు సైతం ఎండిపోతున్నాయి.

బెజ్జూర్‌లో అత్యధిక దిగువకు..

అన్ని మండలాలతో పోల్చితే బెజ్జూర్ మండలంలో అత్యధిక దిగువ స్థాయికి భూగర్భ జలాలు పడిపోయాయి. డిసెంబర్‌తో పోల్చితే ఒక్కనెల వ్యవధిలోనే ఏకంగా 2.03 మీటర్ల లోతుకు దిగజారాయి. బెజ్జూర్ తర్వాత స్థానంలో రెబ్బెనలో డిసెంబర్‌తో పోల్చితే జనవరిలో 1.40 మీటర్ల లోతుకు చేరుకున్నాయి. తిర్యాణి మండలంలో 0.06 మీటర్ల లోతుకు మాత్రమే జలాలు తగ్గగా, తర్వాత స్థానంలో లింగాపూర్‌లో కేవలం 0.10 మీటర్ల తక్కువ లోతులో మాత్రమే భూగర్భ జలాలు తగ్గిపోయాయి.

నెల రోజుల్లోనే 0.68 మీటర్ల లోతుకు..

గడిచిన నెల రోజుల్లోనే జిల్లాలో సగటు భూగర్భ జలాలు 0.68 మీటర్ల లోతుకు పడిపోయాయి. భూగర్భ జలాల సగటు లోతు డిసెంబర్‌లో 6.43 మీటర్లు ఉండగా జనవరి నెలలో 7.11 మీటర్లకు చేరుకున్నాయి. జిల్లాలో సరిపడా వర్షాలు కురవకపోవడం, అక్టోబర్ నుంచి ఇప్పటివరకు భారీ వర్షాలు లేక భూగర్భ జలాలు మరింత లోతుకు పడిపోయే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం ఇబ్బంది లేకపోయినా వేసవిలో ప్రజలు అవస్థలు పడే అవకాశం ఉంది. ప్రధానంగా లింగపూర్, సిర్పూర్(యూ), జైనూర్ వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో అప్పుడే నీటి ఎద్దడి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆదివాసీలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఎండలు ముదిరితే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం లేకపోలేదు.



భూగర్భ జలాల లోతు తనిఖీ చేస్తున్న అధికారి

ఎండుతున్న వాగులు, చెరువులు

నిత్యం నీటి కళతో కనిపించే చెరువులు, వాగులు, కుంటలు సైతం ఈసారి వేసవికి ముందే ఎండిపోయే దశకు చేరుకున్నాయి. జిల్లాలోని రైతులు బోర్లు, సమీప వాగులు, కుంటలు, చెరువులపై ఆధారపడి యాసంగిలో వరితోపాటు వేరుశనగ, ఇతర పంటల సాగు చేపట్టారు. చెరువులు, కుంటల్లో నీటి ప్రవాహం తగ్గిపోయి పంటలకు నీరు అందించలేకపోతున్నాయి. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటి పోతుండటంతో బోర్లకు నీరు అందడం లేదు. దీంతో పంటల పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిమిషం ఆలస్యమైనా | నో ఎంట్రీ



జిల్లా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న అధికారులు

- విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి
- నిర్భయంగా పరీక్షలు రాయాలి
- డీఐఈవో శంకర్
- నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం



శంకర్, డీఐఈవో

ఆసిఫాబాద్‌రూరల్: నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఉండదని, విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని డీఐఈవో శంకర్ అన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు గురి కాకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలని సూచించారు. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 19 కేంద్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్ష ఏర్పాట్లపై మంగళవారం జిల్లా మాధ్యమిక విద్యాధికారి(డీఐఈవో) శంకర్ 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, దీనిపై ప్రిన్సిపాల్ సంతకం కూడా అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

సాక్షి: జిల్లాలో ఎంతమంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నారు?

డీఐఈవో: జిల్లాలో ఇంటర్మీయెట్ ఫస్టియర్‌లో 5,423 మంది, సెకండియర్‌లో 5,000 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. వీరి కోసం 11 ప్రభుత్వ, రెండు ప్రైవేట్, మూడు గిరిజన గురుకులాలు, రెండు మోడల్ స్కూళ్లు, ఎంజేపీలో కేంద్రాలు ఏర్పాటు చేశాం.

సాక్షి: మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

డీఐఈవో: మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం. ప్రతీ కేంద్రంలోని సీసీ కెమెరాల నిఘాలోనే పరీక్ష పత్రాలు తెరుస్తారు. సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. డిపార్ట్‌మెంట్ బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్‌తోపాటు జిల్లా పరీక్ష కమిటీ, అదనపు కలెక్టర్ తనిఖీలు నిర్వహిస్తారు. నిబంధనలు అతిక్రమించి కాపీయింగ్‌ను ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకుంటాం. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు.

సాక్షి: జిల్లాలో ఎండ తీవ్రత పెరిగింది.. విద్యార్థులకు ఎలాంటి వసతులు కల్పిస్తున్నారు?

డీఐఈవో: ఎండ తీవ్రత నేపథ్యంలో ఇప్పటికే కేంద్రాల్లో ప్రత్యేక వసతుల కల్పనకు ఆదేశాలు ఇచ్చాం. మరుగుదొడ్లు, తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశాం. విద్యార్థుల కోసం ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద వైద్యసిబ్బంది కూడా అందుబాటులో ఉంటారు.

సాక్షి: పరీక్షలకు విద్యార్థులను ఏవిధంగా సన్నద్ధం చేశారు?

డీఐఈవో: గతేడాది వార్షిక ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు రెండోస్థానంలో నిలిచాయి. ఈ ఏడాది నంబర్ 1గా నిలిచేందుకు విద్యార్థులను సన్నద్ధం చేశాం. గతేడాది ఫలితాలతో కళాశాలల్లో అడ్మిషన్లు కూడా భారీగా పెరిగాయి. ఈ ఏడాది కూడా ప్రభుత్వ కళాశాలలు కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తాయని ఆశిస్తున్నాం.

సాక్షి: విద్యార్థులకు మీరిచ్చే సలహాలు, సూచనలు..

డీఐఈవో: ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయి. నిర్ణీత సమయం కంటే 30 నిమిషాలు ముందుగానే కేంద్రాలకు చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. 15 నిమిషాల ముందే ప్రశ్నపత్రం అందిస్తారు. నిమిషం నిబంధన అమల్లో ఉంటుందని గుర్తుంచుకోవాలి. పరీక్ష సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపనుంది. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేస్తాం. జిరాక్స్ సెంటర్లు విధిగా మూసి ఉంచాలి.

విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ ఆధ్వర్యంలో పరీక్షలపై చర్చ, శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ముందుగా కుమురంభీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా చూడాలన్నారు. పరీక్షల సమయంలో వారి ఆరోగ్య, మానసిక స్థితిగతులను పర్యవేక్షించాలన్నారు. పిల్లలపై కోపాన్ని ప్రదర్శించకుండా, ప్రేమగా మాట్లాడుతూ వారికి తగిన ప్రోత్సాహం అందించాలని కోరారు. కమిషన్ రాష్ట్ర బాధ్యులు దేవయ్య, డీటీడీవో రమాదేవి, డీఈవో అశోక్, డీఐఈవో శంకర్, పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ఎస్‌వోలు శ్రీనివాస్, భరత్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం డీఆర్వో లోకేశ్వరావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం- 2024, లోకసభ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి విడత పరిశీలన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేశామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఓటరు గుర్తింపు కార్డులను సిద్ధం చేసి, తపాలా శాఖ ద్వారా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం

- ఎస్పీ సురేశ్‌కుమార్
- పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

సిర్పూర్(టి): విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం సాధ్యమవుతుందని ఎస్పీ కె.సురేశ్‌కుమార్ అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ కృషి, పట్టుదల, సమయపాలన విజయానికి ముఖ్యసూత్రాలని పేర్కొన్నారు. మారుమూల గ్రామంలో పుట్టిన తాను కనీసం బస్ సౌకర్యం కూడా లేని ఊరి నుంచి మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకున్నానని గుర్తు చేశారు. జిల్లా ఎస్పీగా పని చేస్తున్నానంటే చదువే ప్రధాన కారణమన్నారు. భయం, ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. సుమారు 575 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. డీఎస్పీ కరుణాకర్, సీఐ సాధిక్ పాషా, ఎస్సై దీకొండ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రి ఇస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

పెద్దపులుల రక్షణే లక్ష్యం

- జిల్లా అడవులు ఇకపై కన్జర్వేషన్ రిజర్వ్
- తెలంగాణ రాష్ట్రంలో మొదటిది జిల్లాలోనే ఏర్పాటు
- రెండు టైగర్ రిజర్వ్‌లకు అనుసంధానంగా అడవులు
- అటవీ చట్టాలు మరింత పకడ్బందీగా అమలు

చింతలమానెపల్లి(సిర్పూర్): కుమురం భీం జిల్లా అడవులు ఇకపై కన్జర్వేషన్ రిజర్వ్‌గా మారనున్నాయి. ఇక్కడ వన్యప్రాణి సంరక్షణ చట్టాలు మరింత పకడ్బందీగా అమలు కానున్నాయి. జిల్లా అటవీ ప్రాంతాలను కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ అటవీ డివిజన్లు ఉన్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో 917 చదరపు కిలోమీటర్లు, ఆసిఫాబాద్ డివిజన్‌లో 1,518 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విశాలమైన అటవీ ప్రాంతం ఉంది. జిల్లా వ్యాప్తంగా 2437 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో ఐదు, ఆసిఫాబాద్ డివిజన్‌లో ఐదు అటవీ రేంజ్‌లు ఉన్నాయి.

విశాలమైన అటవీ సంపద

జిల్లాలో విశాలమైన అటవీ సంపద ఉంది. కాగజ్‌నగర్ డివిజన్‌లో 115 కిలోమీటర్లు, ఆసిఫాబాద్ డివిజన్‌లో 55 చదరపు కిలోమీటర్లు దట్టమైన అడవులు ఉన్నాయి. అటవీ సాంద్రత ప్రకారం జిల్లాలో 890 చదరపు కిలోమీటర్ల సాధారణ అటవీ ప్రాంతం ఉంది. జిల్లాలోని ప్రాణహిత, పెన్‌గంగ, వైన్‌గంగ నదులు, బీబ్రానది(పెద్దవాగు) సహా మరి కొన్ని వాగులు అటవీ ప్రాంతం నుంచి ప్రవహిస్తున్నాయి. సరిహద్దుగా మహారాష్ట్ర ఉండగా మూడువైపులా తాడోబా పులుల అభయారణ్యం, భామ్రాగఢ్, తిప్పేశ్వర్ అభయారణ్యాలు ఉన్నాయి. మరోవైపు తెలంగాణ అటవీ పరిధిలోని కవ్వాల్ పులుల అభయారణ్యం ఉంది.



అరుదైన వన్యప్రాణులకు నిలయం

జిల్లాలోని అడవులు వన్యప్రాణులు నివాసం ఏర్పాటు చేసుకోవడానికి అనువుగా ఉంది. ఈ ప్రాంతంలోని నదులు, వాగుల్లో నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. రాళ్లగుట్టలతో ఉన్న గుహలు జంతువులు నివాసానికి అనుకూలంగా ఉంది. గడ్డి మైదానాలు, నీటి కుంటలు వన్యప్రాణుల మనుగడకు దోహదపడుతున్నాయి. ఇక్కడ పెద్దపులులు, హైనాలు, చిరుత పులులు, నక్కలు, ఎలుగుబంట్లను గుర్తించారు. అరుదైన రాబందులకు పెంచికల్‌పేట్ మండలం పాలరాపు గుట్టలు ఆవాసంగా ఉన్నాయి. పాంగోలిన్, హనీబ్యాడ్జర్ లాంటి అరుదైన నిశాచర జంతువులు సైతం మనుగడ సాధిస్తున్నాయి. జింక, సాంబార్, చుక్కల దుప్పి, అడవి పందులు నివాసం ఉంటున్నాయి. పక్షి జాతులకు ఇక్కడి అడవులు పేరు పొందడంతో అటవీశాఖ తరచూ ఫొటోగ్రాఫర్లను ఆహ్వానించి ఇక్కడి పక్షులను ప్రపంచానికి పరిచయం చేస్తోంది.

కారిడార్‌గా రెండు డివిజన్లు

కవ్వాల్ పులుల రక్షిత అభయారణ్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత జిల్లా అటవీప్రాంతం మహారాష్ట్రలోని పులుల అటవీ అభయారణ్యాలకు కారిడార్‌గా మారింది. పులులు కాగజ్‌నగర్ డివిజన్‌లోని దరిగాం, అంకుసాపూర్, కడంబా అటవీ ప్రాంతంలో శాశ్వత నివాసాలను ఏర్పాటు చేసుకున్నాయి. కవ్వాల్ అభయారణ్యానికి కారిడార్‌గా ఉండాల్సిన జిల్లా అటవీ ప్రాంతం పులుల నివాసంగా మారింది. అయితే 20 ఏళ్లలో తరచూ ఇక్కడ పులులు కనిపించేవి. కానీ స్థిర నివాసం ఏర్పాటు చేసుకోలేదు. కొన్నేళ్లుగా అవి ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకోవడంతో పులుల సంఖ్య పెరిగింది. సుమారుగా 10 నుంచి 14 ఉన్నట్లు గుర్తించారు. తరచూ మహారాష్ట్ర నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. కాగా.. ఇటీవల కాగజ్‌నగర్ డివిజన్‌లోని దరిగాం అటవీ ప్రాంతంలో రెండు పులులు మృతి చెందడం సంచలనంగా మారింది.

అటవీశాఖ ప్రత్యేక దృష్టి

వరుసగా పులులు మృతి చెందడంతో జిల్లాలోని అడవుల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని అటవీశాఖ గుర్తించింది. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ విచారణలో జిల్లా అటవీశాఖ వైఫల్యం ఉందని తేల్చారు. దీంతో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్‌కు కొనసాగింపుగా కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటు ప్రతిపాదనకు రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు ఆమోదం తెలిపింది. జిల్లాలోని 1492 చదరపు కిలోమీటర్ల పరిధిలో పులులు స్వేచ్ఛగా సంచరించేందుకు వీలుగా చర్యలు చేపట్టనున్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 115 కన్జర్వేషన్ రిజర్వ్‌లు ఉండగా.. జిల్లాలో ఏర్పాటు చేయనున్న కన్జర్వేషన్ రిజర్వ్ తెలంగాణ రాష్ట్రంలో మొదటిది కావడం గమనార్హం. కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటుతో వన్యప్రాణుల రక్షణలో భాగంగా చట్టాలు, నిబంధనలను మరింత కఠినతరం చేయనున్నారు. ఈ ప్రాంతం కవ్వాల్, తాడోబా అభయారణ్యాలకు అనుసంధానంగా ఉండగా.. ట్రాఫిక్, రవాణాపరమైన ఆంక్షలు విధించే అవకాశం ఉంది. అటవీ ప్రాంతాన్ని ప్రభావితం చేసే అభివృద్ధి పనులకు అనుమతుల ప్రక్రియ కూడా కఠినతరంగా మారుతుంది. 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం, అనంతరం సవరించిన 2002, 2003 వన్యప్రాణుల సంరక్షణ చట్టాల ప్రకారం నిబంధనలు అమలు చేస్తారు. అటవీ ప్రాంతాల్లో నూతనంగా చెక్‌డ్యాంల నిర్మాణం, గడ్డి మైదానాల పెంపు, నీటి కుంటల నిర్మాణం, జంతువుల ఆహార అవసరాలకు ఏర్పాట్లకు నిధులు మంజూరవుతాయి. అటవీ డివిజన్లను ప్రాజెక్టుగా గుర్తిస్తూ ప్రత్యేకాధికారులను నియమిస్తారు. అటవీ, పులుల రక్షణ కోసం భవిష్యత్తులో కన్జర్వేషన్ రిజర్వ్‌ను టైగర్ రిజర్వ్‌గా కూడా ప్రకటించే అవకాశాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

లక్షెట్టిపేట: మండలంలోని హన్మంత్‌పల్లి గ్రామానికి చెందిన తోటపల్లి నరేశ్ (38) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నరేశ్‌కు పదేళ్ల క్రితం అలేఖ్యతో వివాహమైంది. వీరికి సంతానం కలగలేదు. కాగా, ఇదే గ్రామానికి చెందిన శాంతయ్య తనతో గతంలో అలేఖ్య దిగిన ఫొటోలున్నాయంటూ ప్రచారం చేశాడు. వాటిని అందరికీ చూపిస్తానని ప్రచారం చేయగా తీవ్ర మనస్తాపం చెందిన నరేశ్ ఈ నెల 26న ఇంట్లోంచి బహిర్భూమికని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. నరేశ్ కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికే క్రమంలో గ్రామశివారులోని వ్యవసాయ బావిలో అతడి మృతదేహం లభించింది. శాంతయ్య వేధింపులు భరించలేకే నరేశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి పోషం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శాంతయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన మరో బస్సు



బస్సును ఢీకొన్న మరోబస్సు

ఆసిఫాబాద్‌రూరల్: ఆర్టీసీ బస్సును మరో బస్సు ఢీకొన్న ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు మండలంలోని బూర్గుడ వద్ద ప్రయాణికులను దించేందుకు ఆగింది. ఈక్రమంలో వెనుకనుంచి మరో బస్సు వచ్చి ఆగి ఉన్న బస్సును ఢీకొంది. ముందు ఉన్న బస్సులో 30 మంది, వెనుక ఉన్న బస్సులో 50 మంది ప్రయాణికులున్నారు. ఇందులో లక్ష్మి, వికాస్, లస్మయ్య, రామకు స్వల్ప, అనసూర్యకు తీవ్రగాయాలు కాగా 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనసూర్యకు ముక్కుకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు. రెండు బస్సులు ఆసిఫాబాద్ డిపో నుంచి మంచిర్యాలకు వెళ్లి తిరిగి వస్తుండగా బూర్గుడ గ్రామం వద్ద ఈ ప్రమాదం జరిగింది.

అధిక ధరలకు విక్రయించొద్దు



జరిమానా వసూలు చేస్తున్న విశ్వేశ్వర్

నస్పూర్: దుకాణాదారులు ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి కే విశ్వేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణ పరిధిలోని సుందరయ్యకాలనీ వారసంతలో తూనికలు, కొలతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పలు దుకాణాదారుల కాంటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంటాలను నిర్ణీత సమయంలో రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. అనంతరం సీసీసీలోని ఓ బేకరీలో కూల్‌డ్రింక్‌ను అధిక ధరలకు విక్రయిస్తుండగా నిర్వాహకుల నుంచి రూ.2వేల జరిమానా వసూలు చేశారు.

నూతన కార్యవర్గం

మంచిర్యాలటౌన్: సీనియర్స్ సిటిజన్స్ సంక్షేమ సంఘం జిల్లా కమిటీని జిల్లా కేంద్రంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఈ.మహేందర్‌రాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా పీ పోచయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్ హన్మంతరావు, ట్రెజరర్‌గా తోట రాజయ్య, ఉపాధ్యక్షులుగా బీ కృష్ణ, మోహన్‌లాల్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ ప్రభాకర్ ఎన్నికయ్యారు.

భళా.. బాలశాస్త్రవేత్తలు!

- విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు
- అబ్బురపరిచేలా ఆవిష్కరణలు
- ఇన్‌స్పైర్ మనాక్‌లో ప్రదర్శనలు
- రాష్ట్రస్థాయికి పలువురి ఎంపిక
- నేడు సైన్స్ దినోత్సవం



మంచిర్యాల జిల్లా సైన్స్ సెంటర్ భవనం

మంచిర్యాలఅర్బన్: టెక్నాలజీపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పట్టు సాధిస్తున్నారు. వినూత్నంగా ఆలోచించి అద్భుత ఆవిష్కరణలు రూపొందిస్తున్నారు. బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల ప్రదర్శనలో సరికొత్త ప్రాజెక్టులను ప్రదర్శించారు. నిత్యజీవితంలో ఎదుర్కొనే పలు సమస్యలకు పరిష్కారాలు చూపారు. ఇటీవల జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇన్‌స్పైర్ ప్రదర్శనలో 10 అత్యుత్తమ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మేళాకు ఎంపికయ్యాయి. జనవరి 23, 24తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన విజ్ఞాన మేళాలో బూర్గుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల (భీమారం)కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి సందీప్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సాంకేతిక విద్యామండలి పర్యావరణ పరిరక్షణ పరిశోధన సంస్థ నిర్వహించిన జిల్లాస్థాయి ఉపన్యాస పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. నేడు సైన్స్ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' కథనం..

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు

- జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాల (మంచిర్యాల)కు చెందిన షేక్ సాధిక్ హోమ్ మేడ్ డ్రైన్ క్లీనర్ ప్రాజెక్ట్‌తో ఎవరి అవసరం లేకుండా కాలువలు శుభ్రం చేసే పరికరం తయారు చేశాడు.
- చిన్నమున్ని పబ్లిక్ స్కూల్ విద్యార్థి కొమ్మెర శ్రీవాత్సవ అండర్ ఆర్మ్ క్రచెస్ విత్ సీట్ టార్చ్ లైట్ అండ్ ఫస్ట్ ఎయిడ్ బాక్‌తో దివ్యాంగులు సులువుగా కూర్చోవటం, రాత్రి వేళ టార్చిలైట్‌లా ఉపయోగించటం, అత్యవసర మందులు పెట్టేలా ఉంచుకునే పరికరం తయారు చేశాడు.
- కిష్టాపూర్ జెడ్పీఎస్‌ఎస్ విద్యార్థి తేజావత్ విజయ్ సైకిల్‌పై స్టూడెంట్ ఫ్రెండ్లీ క్యారేజ్‌తో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు వస్తువులు పెట్టుకునే పరికరం రూపొందించాడు.
- అచ్చలాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పొట్లపల్లి సురేశ్ ఈస్లీ రిమూవ్ అండ్ ఇన్‌స్టాల్ బల్బు పేరిట సీలింగ్‌పై ఉన్న విద్యుత్ బల్బులను నేలపై నిల్చొని అమర్చటం, తొలగించే పరికరాన్ని రూపొందించాడు.
- అచ్చలాపూర్ జెడ్పీఎస్‌ఎస్, బీసీ గురుకులానికి చెందిన బామండ్ల పల్లి హర్షిత, అక్కల ప్రశాంత్ ఫెర్టిలైజర్ డ్రాపిగ్ గన్, డంపింగ్ మెషిన్ ఫర్ స్ప్రెయింగ్ ఫెర్టిలైజర్ పరికరంతో చేతితో తాకకుండా తక్కువ సమయంలో పంటలకు ఎరువులు వేసే పరికరాన్ని రూపొందించారు.
- దొడపల్లి జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన సామల విఘ్నేశ్వర్ ఇండీసెంట్ రీప్లైంట్ ప్రాజెక్టును తయారు చేశాడు.
- వీగాం జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన సుష్మిత పోర్టబుల్ వాష్‌బేషన్ పరికరంతో అబ్బురపరిచింది.
- మంచిర్యాల కేజీబీవీకి చెందిన సైదం రవళి ఫ్రీఎనర్జీ వాటర్ పంప్‌తో విద్యుత్ అవసరం లేకుండా నీటిని సరఫరా చేసే పరికరంతో ఔరా అనిపించింది.
- అచ్చలాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన మామిడి స్ఫూర్తి డివైస్ ఫర్ ప్లాంటింగ్ సీడ్స్ అండర్ మేకింగ్ హోల్స్ (వ్యవసాయ కూలీలు అవసరం లేకుండా తక్కువ శ్రమతో భూమిలో రంధ్రాలు చేయటం.. ఒకే సమయంలో విత్తనాలు వేయడం) పరికరంతో మెప్పించింది.

పరిసరాల పరిశుభ్రతకు..



ప్రయాణం చేసేటప్పుడు వాంతులు, విరోచనాలతో బాధపడేవారి కోసం బస్సులో టాయిలెట్ గది, వాష్‌బేషన్, నీటి ట్యాంక్ ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. వ్యర్థాలు నిండిన తర్వాత సమీపంలోని బస్టాండ్‌లో శుభ్రం చేసి మళ్లీ నీటితో నింపి ప్రయాణికులకు ఉపయోగపడేలా చేయవచ్చు. దీంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటంతో పాటు సమయం వృథాను అరికట్టవచ్చు. అందుకే పోర్టబుల్ వాష్‌బేషన్ రూపొందించాను.

– సుష్మిత, వీగాం భీమిని జెడ్పీఎస్‌ఎస్

వ్యాధుల నుంచి కాపాడుకునేలా..



ఇంటి ముందు డ్రెయినేజీలో చెత్తాచెదారం పేరుకుపోవటం చూశాను. వ్యర్థ నీరు రోడ్లపై ప్రవహించటం, దోమలు వృద్ధి చెందటం.. జనాలు వ్యాధుల బారిన పడడం గమనించాను. వానాకాలంలో మున్సిపల్ కార్మికులు కూడా డ్రెయినేజీ శుభ్రం చేసేందుకు వీలుండదు. ఇలాంటి సమస్యను అధిగమించేందుకు హోమ్ మేడ్ డ్రైన్ క్లీనర్ పరికరాన్ని తయారు చేశాను. దీంతో ఎవరి అవసరం లేకుండా కాలువలు శుభ్రపర్చుకోవచ్చు.

–షేక్ సాధిక్, మంచిర్యాల జెడ్పీహెచ్‌ఎస్ (బాలుర)

స్టూడెంట్ ఫ్రెండ్లీ సైకిల్ క్యారింగ్



తాను తయారు చేసిన సైకిల్ క్యారింగ్ పరికరంతో విజయ్‌కుమార్

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి తేజావత్ విజయ్‌కుమార్ నిత్యం సైకిల్‌పై కామన్‌పల్లి నుంచి పాఠశాలకు వస్తుంటాడు. వానాకాలంలో బ్యాగ్ వెనుక స్టాండ్‌కు పెట్టి సైకిల్‌పై వస్తుండగా అది కింద పడి బురద అంటింది. ఇలా పలుసార్లు జరగడంతో అతడికి ఓ ఆలోచన తట్టింది. ఇనుప పట్టీలు, స్క్రూలతో ఓ పరికరాన్ని రూపొందించి సైకిల్‌కు అమర్చాడు. దీంతో అతడి పమస్యకు పరిష్కారం లభించింది. దీనిని 15 రోజుల క్రితం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో విజయ్‌కుమార్ ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు.

టాలెంట్ టెస్ట్‌లో అశ్వక్..

జన్నారం మండలం కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అశ్వక్ రాష్ట్రస్థాయి సైన్స్ ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో సైన్స్ డేను పురస్కరించుకుని నిర్వహించిన మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి పొందాడు. జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నాడు. సైన్స్‌పై అవగాహన ఉండటంతో సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో తాను గుర్తింపు తెచ్చుకున్నట్లు అశ్వక్ తెలిపాడు.

విజ్ఞాన గనిగా సైన్స్ సెంటర్

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు, ఆవిష్కరణలకు జిల్లా సైన్స్‌సెంటర్ దిక్సూచిగా నిలుస్తోంది. జిల్లా స్థాయినుంచి జాతీయ స్థాయి వరకు ఎంతోమంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి నూతన ఆవిష్కరణలు రూపొందించేందుకు ఇది వేదికైంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడలోని సైన్స్ సెంటర్ ప్రేరణతో 2018 ఆగస్టు 9న అప్పటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ జిల్లా సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ నిధులు రూ.16,93,300 వెచ్చించి అన్ని రకాల పరిశోధనలకు సంబంధించిన పరికరాలు ఇందులో అందుబాటులో ఉంచారు. జిజ్ఞాస మొబైల్ వ్యాన్ ద్వారా ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. దీని ద్వారా 127 పాఠశాలలకు చెందిన 8వేల మంది విద్యార్థులు, 500 మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరింది.

ఎగ్జిబిషన్ బుక్‌లో ప్రచురితం

గనుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జనవరి 22, 23తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగిన రెండో మైనింగ్ మినిస్టర్ కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్ టేబుల్ బుక్‌లో జిల్లా సైన్స్ సెంటర్‌కు సంబంధించిన పలు విషయాలు ప్రచురించబడ్డాయి. కాఫీ టేబుల్స్‌లో భారతదేశం అంతటా అనేక ముఖ్యమైన డీఎంఎఫ్ ప్రాజెక్టుల విజయగాథలున్నాయి. తెలంగాణ నుంచి జిల్లా సైన్స్ సెంటర్‌ను ఎంపిక చేశారు. మినిస్ట్రీ ఆఫ్ మైన్స్ భారత ప్రభుత్వం ఎక్స్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగాం, కూ, త్రెడ్స్ లాంటి అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో జిల్లా సైన్స్ సెంటర్ విజయగాథను పోస్ట్ చేసింది. దీనిపై జిల్లా సైన్స్ అధికారి మధుబాబు హర్షం వ్యక్తం చేశారు. సైన్స్ సెంటర్ అభివృద్ధి, విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా విద్యాధికారి యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రయోగాలను వీక్షిస్తున్న డీఈవో యాదయ్య

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపిక

విత్తనాలు వేసే పరికరం

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థిని మైదం స్ఫూర్తి విత్తనాలు వేసే పరికరాన్ని రూపొందించింది. దీని ద్వారా నేలకు రంధ్రం చేసి విత్తనాలు వేయొచ్చు. తక్కువ సమయంలో సులభంగా విత్తనాలు విత్తుకోవచ్చు. పని సత్వరంగా పూర్తి కావడంతో పాటు కూలీల సమస్య ఉండదు.



పరికరంతో మైదం స్ఫూర్తి

సీలింగ్ బల్బు వేసే పరికరం

ఇదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పొట్లపల్లి నరేశ్ సీలింగ్ బల్బు వేసే పరికరాన్ని తయారు చేశాడు. దీని ద్వారా నేలపై నిల్చుని సీలింగ్‌కు ఉన్న బల్బులు తీయవచ్చు. కొత్త బల్బులు బిగించవచ్చు.



పరికరంతో పొట్లపల్లి నరేశ్

ఎరువు డ్రాపింగ్ గన్

పదో తరగతి విద్యార్థిని బామండ్లపల్లి హర్షిత పత్తి, మిర్చి, టమాట మొక్కలకు సులభంగా ఎరువు వేసే పరికరాన్ని రూపొందించింది. దీని ద్వారా చేతితో ఎరువులు ముట్టుకోకుండానే తక్కువ సమయంలో ఎక్కువ మొక్కలకు తగినంత పరిమాణంలో సులభంగా ఎరువులు వేయవచ్చు.



పరికరంతో బామండ్లపల్లి హర్షిత

రాష్ట్రస్థాయి ఉపన్యాసపోటీలకు..

ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థిని వీ హాస్నిత జాతీయస్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఉపన్యాసపోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 28వ తేదీన వరంగల్ జిల్లా సైన్స్‌సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో హాస్నిత బహుమతి అందుకోనుంది.



బహుమతి అందుకుంటున్న హాస్నిత

యువతి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

పెంచికల్‌పేట్: మండలంలోని గుండెపల్లి గ్రామానికి చెందిన తలండి నిర్మల హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గుండెపల్లి గ్రామానికి చెందిన తలండి నిర్మల, కొయపల్లి గ్రామానికి చెందిన కుమురం రవికుమార్ ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. గత శుక్రవారం రవికుమార్ గుండెపల్లి గ్రామానికి రాగా నిర్మల చెట్టుకింద ఫోన్‌లో మాట్లాడుతూ కనిపించింది. ఎవరితో మాట్లాడుతున్నావని అనుమానంతో గొడవకు దిగాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఆగ్రహంతో కర్రతో నిర్మల తల, మెడపై రవికుమార్ దాడి చేయగా ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఆమెను పక్కకు తీసుకువెళ్తున్న క్ర మంలో కాళ్లు, చేతులు కదిపింది. దీంతో రవికుమార్ మరోసారి ఆమెపై కర్రతో దాడి చేసి సమీప వ్యవసాయ బావిలో పడేశాడు. ఎంతసేపటికీ నిర్మ ల ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. వ్యవసాయ బావి సమీపంలో ఆమె చెప్పులు, రక్తపు మ రకలు కనపడగా తండ్రి నారాయణ పోలీసులకు స మాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న పోలీ సులు బావిలో వెతకగా యువతి శవం లభ్యమైంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం ఎల్కపల్లి సమీపంలో రవికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. రవికుమార్ తానే హత్య చేసినట్లు ఒప్పుకోగా, అతడి నుంచి సెల్‌ఫోన్, హత్యకు ఉపయోగించిన కర్రను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై కొమురయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

ఇద్దరికి గ్రామస్తుల దేహశుద్ధి

- పిల్లలను ఎత్తుకెళ్లేవారని అనుమానం



బూర్గుపల్లిలో పట్టుబడ్డ వ్యక్తి

భీమారం: మండలంలోని కాజిపల్లి, బూర్గుపల్లి గ్రామాల పరిధిలో పిల్లలను ఎత్తుకెళ్లే వ్యక్తులుగా భావించి ఇద్దరు అనుమానితులకు ప్రజలు సోమవారం రాత్రి దేహశుద్ధి చేశారు. మంగళవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కొద్ది గ్రామాల్లో పిల్లలను ఎత్తుకెళ్లే ముఠాలు సంచరిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి బూర్గుపల్లిలోని గెర్రిగూడెం సమీపంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరగడం చూసిన స్థానికులు వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇందులో ఇద్దరు తప్పించుకుపోగా ఒకరు పట్టుబడ్డాడు. అతడిని చితక బాది అనంతరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. మంగళవారం ఉదయం కాజిపల్లి సమీపంలో మరో వ్యక్తి గ్రామస్తులకు తారసపడ్డాడు. అతడి వివరాలు తెలుసుకునేందుకు యత్నించినా చెప్పలేదు. పైగా అతడి వద్ద కత్తి లభించింది. దీంతో ప్రజలు కత్తి స్వాధీనం చేసుకుని అతడిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఏఎస్సై భూమన్న సాక్షితో మాట్లాడుతూ.. పట్టుబడ్డ ఇద్దరిని ప్రశ్నిస్తే ఎలాంటి సమాధానం చెప్పలేదని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందినవారై ఉంటారని, మతిస్థిమితం లేనివారిగా గుర్తించి వదిలిపెట్టినట్లు పేర్కొన్నారు.



అనుమానిత వ్యక్తి వద్ద లభించిన కత్తి



కాజిపల్లిలో పట్టుబడ్డ వ్యక్తి

సైన్స్‌తోనే మానవ మనుగడ



మాట్లాడుతున్న వీరబ్రహ్మకిషన్

లక్సెట్టిపేట: సైన్స్‌తోనే మానవుని జీవితం ముడిపడి ఉందని, సైన్స్‌తో మానవ మనుగడ సాధ్యమని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ జోనల్ సెక్రటరీ, ఫార్మసీ ప్రొఫెసర్ డాక్టర్ వీరబ్రహ్మకిషన్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ముందస్తు నేషనల్ సైన్స్ డే సందర్భంగా 'వికసిత్ భారత్ కోసం దేశీయ సాంకేతికలు' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిత్య జీవితంలో సైన్స్ పాత్ర మరువలేమని పేర్కొన్నారు. బయాలజీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ మాత్రమే సైన్స్ కాదని, సృష్టిలో ప్రతీది సైన్స్‌తో ముడిపడి ఉందని విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. ప్రకృతిలో జరుగుతున్న ప్రతీ విషయం వెనుక సైన్స్ దాగి ఉంటుందని తెలిపారు. సీవీ రామన్ ఎఫెక్ట్ భారతదేశానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగయ్య, కోఆర్డినేటర్ సవిత, అధ్యాపకుడు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల న్యాయనిర్ణేత రాజలింగు

మంచిర్యాలటౌన్: జాతీయ స్థాయి ఆల్ ఇండియా పోలీస్ మీట్ హ్యాండ్ బాల్ పోటీలను ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నిర్వహించనుండగా రిఫరీగా తెలంగాణ నుంచి దుర్గం రాజలింగు ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేశ్ తెలిపారు. రాజలింగు జైపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు.



రాజలింగు

సీసీరోడ్ల పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ బాపూరావు

జన్నారం: మండలంలోని పొనకల్, బాదంపల్లి, చింతగూడ, ధర్మారం గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల పనులను ఎంపీ సోయం బాపూరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గ్రామాలాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం, మోదీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్పంచులకు నిధులు మంజూరు చేయక అభివృద్ధి కుంటుపడేలా చేసిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 80 రోజులైనా గ్రామాలాభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నా ప్రధాని ఫొటో పెట్టకుండా, రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు. ఎంపీ బండి సంజయ్ చేస్తున్న యాత్రను అడ్డుకోవడం సరికాదన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు గోలి చందు, జిల్లా నాయకుడు మధుసూదన్‌రావు, బీజేవైఎం అధ్యక్షుడు ముదుగు ప్రవీణ్, నాయకులు మల్లేశ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విద్యాబోధన

మందమర్రిరూరల్: సింగరేణి కాలరీస్ (ఎయిడెడ్) హైస్కూల్లో విద్యార్థులకు అంకితభావంతో విద్యాబోధన జరుగుతోందని ఏరియా జీఎం మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం ఏరియాలోని సింగరేణి హైస్కూల్ 49వ వార్షికోత్సవం నిర్వహించగా ఏరియా సేవాసమితి అధ్యక్షురాలు సవితా మనోహర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందమర్రిలోని సింగరేణి హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు రాజకీయ, ఉద్యోగ రంగాల్లో రాణించి ఉన్నత స్థానంలో నిలిచారని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని మంచి జీపీఏ వచ్చేలా పరీక్షలు రాయాలని సూచించారు. పాఠశాలకు మరికొన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉందని హెచ్‌ఎం పురుషోత్తం తన వార్షిక నివేదికలో కోరగా.. తప్పకుండా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జీఎం హామీ ఇచ్చారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, కరస్పాండెంట్, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏరియా జీఎం మనోహర్

జాతర హుండీ లెక్కింపు

మందమర్రిరూరల్: ఈనెల 21నుంచి 23వ తేదీ వరకు పాలవాగు సమీపంలోని ఆర్కే–1ఏ గని వద్ద సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మక్క–సారలమ్మ జాతరలో ఏర్పాటు చేసిన హుండీలను మంగళవారం ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో లెక్కించారు. రూ.13,61,700 ఆదాయం వచ్చినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ తెలిపారు. ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఆర్కే–1ఏ గని మేనేజర్ జయంత్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ రవి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, దాగం మల్లేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది